క్లుప్తంగా

చింతూరు ఎస్‌ఐగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

చింతూరు: స్థానిక ఎస్‌ఐగా దుంపల శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పాడేరు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై చింతూరు ఎస్‌ఐగా వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన యాదగిరి ఎటపాక స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

100 మందికి నేత్ర పరీక్షలు

రాజవొమ్మంగి: తంటికొండ పంచాయతీ ఒట్టిగెడ్డ పాఠశాలలో ఆదివారం అంజు కంటి ఆస్పత్రి (కాకినాడ) ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 100 మందికి సేవలందించారు. వీరిలో 19 మందికి కంటి ఆపరేషన్లు అవసరమున్నట్టు వైద్య నిపుణులు గుర్తించి కాకినాడలోని అంజు కంటి ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ తేజ, సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, ఉప సర్పంచ్ వెంకటరమణ, సిబ్బంది స్వామివందనం, సూర్యనారాయణ, విద్యాసాగర్, ఆయుష్ చంద్ర, విజయ్, నాగేంద్ర పర్యవేక్షించారు.

చిలకల తీర్థానికి ఏర్పాట్లు

పాయకరావుపేట : పట్టణంలో గల పేరంటాలమ్మ గుడి రంగు రంగులతో అలంకరిస్తున్నారు. ఉగాది నాడు పేరంటాలమ్మ తీర్థం జరుగుతుంది. దీనినే చిలకల తీర్థం అని కూడా అంటారు. సాయంత్రం 4 గంటల నుంచి తీర్థం జరుగుతుంది. పేరంటాలమ్మ గుడిని మహిళలు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటారు. మలిపెద్ది కుటుంబీకులు గుడికి నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు.

మెనూ అమలుచేయాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్

అరకులోయ రూరల్: మండలంలోని కంఠభంసుగూడ ప్రభుత్వం ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్ ఆదివారం సందర్శించి, మెనూ పరిశీలించారు. వసతిగృహంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే మెనూ సక్రమంగా అమలుచేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. ఈ విషయంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు వసతిగృహం నిర్వహణపై విచారణ చేపట్టాలని కోరారు.

రెండు వేల మందికి వాయనాలు


వాయనాలు ఇస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రెండు వేల మంది ముత్తయిదువులకు వాయనాలుగా జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ అందించారు. అమ్మవారి మాలధారుల సేవా సంఘం వ్యవస్థాపకులు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో వ్యాపారవేత్త మళ్ల జగప్పారావు, మోహిని దంపతుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖర్, సంఘం సభ్యులు మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కొలపర్తి శ్రీను, ఉదయ్, అక్షయ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు రేపు

దేవరాపల్లి: ఎం. అలమండలో నూకాంబిక అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ తెలిపారు. పోటీల్లో గెలుపొందే ఎడ్లబళ్లకు రూ.20 వేలు, రూ.16 వేలు, రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

పరీక్ష కాలం.. ఆరోగ్యం ప్రధానం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెట్రిన్ రాజ్యలక్ష్మి

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- చదువుపైనే అందరి దృష్టి
- నిద్ర, పౌష్టికాహారం ప్రాధాన్యంపై విద్యార్థులకు వైద్యుల సూచనలు

అనంతగిరి: పరీక్షలు...ఏడాది శ్రమ ఫలితానికి ప్రామాణికం. అందుకే పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధకులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలోని విద్యార్థులకు భయం, ఆందోళన ఆవిరిస్తుంటాయి. విద్యార్థులు అధిక సమయం చదవడంపైనే దృష్టి సారిస్తుంటారు. సకాలంలో పౌష్టికాహారం తీసుకోకపోవడం, నిద్రపోకుండా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలోని పరీక్షలపై నిపుణులు విద్యార్థుల్లో మరో ధైర్యాన్ని నింపుతున్నారు.

పరీక్షల నిర్వహణ ఇలా

మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ ప్రథమం, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి ప్రారంభం కానున్నాయి. ఆరు వారాల పాటుగా పరీక్షల వాతావరణంలోని విద్యార్థులు మసలుకోవాల్సి ఉంటుంది. అల్లూరి జిల్లాలలోని ఇంటర్ పరీక్షలకు సుమారు 10,923 మంది పరీక్షలు రాస్తుండగా, పదో పరీక్షలు 11,545 మంది పరీక్షలు రాయనున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పరీక్ష కాలంలో ప్రతి క్షణం విలువైనదే. సమస్య ఏదైన తలెత్తితే విద్యార్థికి సమయాన్ని దూరం చేసేస్తోంది. చదువుతో పాటుగా తగిన విశ్రాంతి కూడా అవసరమని గుర్తించాలి. చిన్నపాటి తలనొప్పి, జ్వరం వచ్చినప్పటికీ ఏకాగ్రత దెబ్బతింటుంది. సమస్య పెద్దది కాకుండానే వైద్యుడ్ని సంప్రదించడం మంచిది. రోజుకు ఆరు గంటల పాటు నిద్రపోవాలి, శరీరానికి, మెదడుకు తగిన విశ్రాంతి అవసరం. సమయానికి అనుగుణంగా పౌష్టికాహారం తీసుకోవాలి.

– జ్ఞానేశ్వరీ, వైద్యాధికారి, అనంతగిరి పీహెచ్‌సీ

పరీక్షలపై అవగాహన

విద్యార్థులకు పరీక్షలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఒత్తిడి లోనుకుండా అవగాహన కల్పించడంతో పాటుగా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నాం. పరీక్షల సమయంలోని ఆందోళన చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు ధైర్యానిస్తున్నాం.

– మల్లీశ్వరీ, హెచ్‌ఎం, బాలికల–1 పాఠశాల

ప్రజాప్రతినిధుల చొరవతో పాఠశాల ఏర్పాటు


విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంపీపీ కడబాల ఆనందరావు

వై.రామవరం: మండలంలోని ఎగువ ప్రాంతం దారగడ్డ పంచాయతీ కారుమామిడిగొంది గ్రామంలో ప్రజాప్రతినిధుల చొరవతో నూతన పాఠశాలను ఆదివారం ప్రారంభించారు. పాఠశాల లేని ఆ గ్రామంలో 32 మంది బడిఈడు పిల్లలున్నట్టు ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చింది. దీంతో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు స్పందించి స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకట లక్ష్మి తదితరులతో చర్చించారు. ఈ మేరకు వారు గ్రామంలో సందర్శించి, 32 మంది బడిఈడు పిల్లలను గుర్తించారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఇంటర్ చదివిన కిచ్చలి చంద్రకళ అనే గిరిజన యువతికి విద్యా వలంటీర్‌గా అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై వెంటనే పీఓ స్పందిస్తు ఆ యువతికు విద్యా వలంటీరుగా ఉత్తర్వులు ఇచ్చారు. తక్షణమే గ్రామంలో పాఠశాల ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం గ్రామంలో పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు, విద్యా కానుక కిట్లను ఎంపీపీ కడబాల ఆనందరావు చేతుల మీదుగా అందజేశారు.

రేపు రహదారి పునర్నిర్మాణ పనులకు భూమిపూజ

అడ్డతీగల: ఏలేశ్వరం నుంచి జెడ్డంగి వరకూ 10 కిలోమీటర్ల మేరకు రూ.22.47 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పునర్నిర్మాణ పనులకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గొంటువానిపాలెం వద్ద భూమిపూజ నిర్వహించనున్నట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి అడ్డతీగల మండలం గొంటువానిపాలెం మీదగా ఈ రహదారి పనులు నిర్వహిస్తారన్నారు. రహదారిని వెడల్పు చేసి పునర్నిర్మించనున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా గరగల ఊరేగింపు


చినగుమ్ములూరులో అమ్మవారి గరగలను నెత్తిన పెట్టుకుని ఊరేగిస్తున్న భక్తులు


కె.వి.పురంలోని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం : గ్రామాల్లో కొత్త అమావాస్య వేడుక పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి గరగలు ఊరేగింపు పెద్ద ఎత్తున చేపట్టారు. మరో రెండు రోజుల్లో అమ్మవారి జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వీధుల్లో అమ్మవారి గరగలు మరింత ఉత్సాహంగా తిప్పుతున్నారు. గరగలను భక్తులు వారి శిరస్సుపై ఉంచుకుని మొక్కు చెల్లించుకుంటారు. యువతులు, గృహిణులు అమ్మవారి ఊరేగింపు వీధుల్లోకి రాగానే వీధులను శుద్ధి చేసి గరగలను దర్శించుకుంటున్నారు. మంగళవారం చినగుమ్ములూరు, తిమ్మాపురం, సర్వసిద్ధి, గుర్రాజుపేట తదితర గ్రామాల్లో కొత్త అమావాస్య జాతరను వైభవంగా నిర్వహిస్తారు.

కోటవురట్ల : కొత్త అమావాస్య దగ్గర పడుతుండడంతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఇప్పటికే అమ్మవారి ఆలయాలు ముస్తాబు కాగా సాంస్కృతిక కార్యక్రమా లు, గరగల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. కె.వెంకటాపురంలో ఆదివారం గరగలను ఊరేగించారు.

నూకాంబిక ఘటాల ఊరేగింపు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఘటాలను ఘనంగా ఊరేగిస్తున్నారు. భక్తులు ఘటాలను దర్శించుకొని పూజలు చేస్తున్నారు. దిమిలి, వెల్చూరు, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఘటాలను భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తున్నారు.

నేటి నుంచి నూకాలమ్మతల్లి జాతర

గొలుగొండ: డివిజన్ ప్రజల ఆరాధ్య దైవమైన లింగంపేట నూకాలమ్మతల్లి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు ఇక్కడ పెద్ద ఎత్తున తీర్థం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఎడ్ల పందేలు, కబడ్డీ పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం కోసం గొలుగొండ, నర్సీపట్నం, చింతపల్లి, నాతవరం, రాజవొమ్మంగి ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు రానున్నారు. వీరికి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీవారు, పోలీసులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నూకాలమ్మ జాతరకు సిద్ధం

పాయకరావుపేట : కొత్త అమావాస్య సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవార్ల ఆలయాల వద్ద సోమవారం రాత్రి జాతర్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గత 15 రోజులుగా సంబరాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగవరం గ్రామంలో సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఆలయం వద్ద విద్యుత్ కాంతులతో అలంకరించారు.

నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు


శ్రీరాసకొండ బాల చెల్లమ్మ అమ్మవారు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి, మద్దిగరువు గ్రామాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు రాసకొండ బాల చెల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం అమ్మవారికి తొలిపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మంగళవారం డప్పు వాయిద్యాలతో ఘటాల ఊరేగింపు , బుధవారం క్రీడల్లో విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే జాతర మహోత్సవాలకు ఆంధ్ర- ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాలు ముగింపు రోజున ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్టీ సెల్ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పార్టీఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ కొర్రా పద్మ, జనసేన అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య విచ్చేస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామస్తులకు నిత్యావసర వస్తువుల పంపిణీ


గ్రామస్తులకు వంటసామగ్రి అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

కూనవరం: కొండరెడ్ల కుగ్రామాల్లో వచ్చే జూలై నాటికి సోలార్ పంపు సెట్లు, సోలార్ లాంతర్లు ఏర్పాటు కృషి చేయనున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి అన్నారు. కూనవరం మండలం కూటూరు గట్టు పరిధిలో కొండలపై ఉన్న గబ్బిలాల గొందిలో ఆదివారం కొండరెడ్ల కుటుంబాలకు కిచెన్ సెట్స్, టార్పాలిన్లు, హైజీన్ కిట్స్ పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు విలువైన సామగ్రిని 150 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో సోలార్ లాంతర్లు, పంపుసెట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. కొండరెడ్లు ఆదిమ సమాజం నుంచి ఆధునిక సమాజానికి చేరువ కావాలని ఆయన కోరారు. అనంతరం కూటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, తహసీల్దార్ కె.అనసూయ, కూటూరు వైద్యాధికారి శ్రీనివాసమూర్తి, కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ బ్రహ్మయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ వెంకటేశ్వరరావు, ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, వైఎస్ చైర్మన్ గంగరాజు, జిల్లా కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, పాయం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు


వైద్యులతో మాట్లాడుతున్న స్వామీజీ

రంపచోడవరం: మండల కేంద్రంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిష్ఫలానందజీ మహరాజ్ తెలిపారు. శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్ర లయ వేమగిరి 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 16 మందికి కళ్లద్దాలు , 12 మందికి కంటి ఆపరేషన్ల కోసం తరలించనున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు జి.వి.రామారావు , రాఘవేంద్ర రావు, బి.శాంత దేవి, కృష్ణ పాతూరి, రాయుడు శ్రీనివాస్, జి.భాస్కర్ , సంపత్ కుమార్, జీఎస్ఎల్ వైద్యులు సేవలందించారు. శిబిరంలో రామకృష్ణ మిషన్ క్యాంప్ కో–ఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్ , వలంటీర్లు, రామకృష్ణ మిషన్ సేవా సమితికి చెందిన కరుణామూర్తి రాజగోపాల్ హోసూరు, శర్మ, తుని రామకృష్ణ సేవా సమితి , వేట్ల పాలెం సేవా సమితికి చెందిన కంటిపూడి గోపాలకృష్ణ , బలరాం సిబ్బంది పాల్గొన్నారు . శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించినట్టు స్వామీజీ తెలిపారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి


జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లిరూరల్: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు పోతురాజు బాలయ్య అన్నారు. ఆదివారం గొందిపాకలు నూకాంబిక జాతర ముగింపు సంబరాలను ఉత్సవ కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ పోతురాజు మాట్లాడుతూ ఆదివాసులు విభిన్న ఆచారాలు, కట్టుబాట్లుతో గ్రామ దేవతల జాతరను నిర్వహిస్తారన్నారు. ఆదివాసీ గిరిజన సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయి ఆలయానికి గంటను బహుకరించారు. ఈ సందర్భంగా గొందిపాకలు పంచాయతీ పరిధిలో 2022 పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు జనకాని కృష్ణయ్య నగదు బహుమతిని జెడ్పీటీసీ సభ్యుడు, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామారావు, గంగరాజు, అబ్బాయినాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా నూకాలతల్లి పండగలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం నూకాలమ్మ పండగను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎంతో ప్రసిద్ధి కలిగిన కొవ్వూరు కూడలిలో నూకాలతల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి గ్రామస్తులతోపాటు రోలుగుంట, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు వేకువజాము నుంచి తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ నిర్వాహకులు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆలయానికి వచ్చిన భక్తులు ప్రసాదంగా స్వీకరించారు. బుచ్చింపేటలో ఈ పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రమణ సమకూర్చిన ప్రసాదం పంచిపెట్టారు. సాయంత్రం భజనలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మన్యంలో భారీ వర్షం


ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం


కొయ్యూరులోని సీడీపీవో కార్యాలయం మార్గంలో చేరిన వర్షపు నీరు


రాజవొమ్మంగిలో మడికట్టు నేలలో నీరు చేరిన దృశ్యం

డుంబ్రిగుడ/హుకుంపేట/ముంచంగిపుట్టు/కొయ్యూరు/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రధాన రహదారి కామయ్యపేట రహదారి పూర్తిగా జలమయమైంది. ముంచంగిపుట్టు నుంచి జర్రెల పంచాయతీ కేంద్రానికి వెళ్లే మట్టిరోడ్డు బురదమయంగా మారింది. జీడీ మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్యూరు లో భారీగా కురిసింది. రాజవొమ్మంగి అల్పపీడన ప్రభావంతో ఆదివారం భారీ వర్షం కురిసింది. మండలంలో 44.6 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వాతావరణం చల్లబడడంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పెదబయలు/కొయ్యూరు: పెదబయలు ప్రాజెక్టు పరిధిలోని బొంగరం, కొయ్యూరు, బొంకులపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవోలు ఎం.రాజశ్రీ, విజయకుమారి శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలని, స్థానికులై ఉండాలని పేర్కొన్నారు. కుల, నివాస ధ్రువపత్రాలను జతచేసిన దరఖాస్తులను ఈనెల 24వ తేదీ లోగా సమీపంలో ఐసీడీఎస్ కేంద్రంలో నేరుగా , లేనిపక్షంలో పోస్టు ద్వారా అందజేయాలని కోరారు.

ఘనంగా తాకాశివీధి నూకాంబిక జాతర


ఆలయం నుంచి మొదలైన గరగల ఊరేగింపు


పులివేషాలు


కాళీమాత నృత్యాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక తాకాశివీధి స్వయంభూ నూకాంబిక ఆలయంలో అమ్మవారి కొత్త అమావాస్య జాతర వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయం నుంచి గరగల ఊరేగింపు, తోడపెద్దుసేవ, కోలాటాలు, పులివేషాలు, న్యూకాంతార, లేడీస్ తీన్‌మార్, డూప్స్ బాబోయ్ డూప్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 20 వరకు నెల రోజులపాటు అత్యంత వేడుకగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ అమ్మవారు పుట్ట నుంచి వెలిసినట్టు చెప్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలుస్తుంటారు. సోమవారం సాయంత్రం 6 నుంచి మంగళవారం ఉదయం వరకు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పిస్తారు. 21న అమ్మవారికి అమావాస్య పూజ చేస్తారు. 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు దీపాలంకరణలో దేదీప్యమానంగా అమ్మవారి దర్శనం లభించనుంది. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే ఆలయంలో జాతరను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. క్యూలైన్‌లు, తాగునీరు వంటి మౌలిక సాదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.